చిరు వ్యాపారులతో మమేకం

- సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఎంపీ ఎంవీవీ భరోసా
- 19వ వార్డులో విస్తృత పర్యటన


రామారావును పరామర్శిస్తున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు


చిరు వ్యాపారి బడ్డీ వద్ద టిఫిన్ తింటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చిరు వ్యాపారులతో మమేకమయ్యారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇస్తూ భరోసా కల్పించారు. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల అమలుపై 19వ వార్డు పెదజాలరిపేటలో పార్టీ వార్డు ఇన్‌చార్జి వెంకటలక్ష్మితో కలిసి ఇంటింటికి వెళ్లి ఎంపీ అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా స్థానిక చిరువ్యాపారులతో మమేకమవుతూ.. సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఓ చిరువ్యాపారి బడ్డీ వద్ద అల్పాహారం తిన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం ప్రతి ఇంటికి మంచి జరిగిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక సీట్లతో గెలిపించాలని ఎంపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

వైఎస్సార్‌సీపీ నాయకుడు డి.రామారావును విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. ఇటీవల రామారావు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాలు విరిగిపోయింది. దీంతో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన ఇటీవల డిశ్చార్జ్ అయ్యి ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంవీపీ కాలనీ 18వ వార్డు మూలపాలెంలోని రామారావు నివాసానికి ఎంపీ ఎంవీవీ వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, మరుపల్లి పరదేశి, ఈశ్వరరావు, రాజేష్, ప్రతాప్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతుడి భార్యకు సాయం అందిస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: అనారోగ్యంతో మృతి చెందిన పిల్లా గంగులోడు(48) కుటుంబ సభ్యులను విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. 19వ వార్డు పెదజాలరిపేటలోని గంగులోడు ఇంటికి వెళ్లి తొలుత అతని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం అతని భార్యతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ 19వ వార్డు ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, పరసన్న, గణేష్, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైంగిక వేధింపులను అరికట్టాలి


ప్రభుత్వ బాలికల గృహంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

ఆరిలోవ: బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ లైంగిక దోపిడీ వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం ప్రభుత్వ బాలికల గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు ఎదురవుతున్న లైంగిక వేధింపులను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు జాగ్రత్తగా మెలగాలని, దాడులపై అవగాహన ఉండాలని సూచించారు. లింగ వివక్షత, పేదరికం, బాలలకు తగిన రక్షణ లేకపోవడం లైంగిక దాడులకు కారణాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బాలిక గృహం సూపరింటెండెంట్ సునీత, డాక్టర్ బాబ్జీ, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయబాబు, తదితరులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 252 మంది విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు. ఈ మేళాలో 15 సంస్థలు పాల్గొనగా.. 611 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, డాక్టర్ పి.జయ, పి.గోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక


వీసీ ప్రసాదరెడ్డితో ప్రభుత్వ సలహాదారు అజయ్ కల్లాం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం సోమవారం సందర్శించారు. ఏయూలోని ఓ సదస్సులో పాల్గొనడానికి విచ్చేసిన ఆయన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అజయ్ కల్లాం వీసీ వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 7వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. హీరో మోటార్స్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థల్లో 140 ఉద్యోగాలకు భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ట్రైనీ, జూనియర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, ప్రొడక్షన్ అసెంబ్లీ, ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తిరుపతి ప్రాంతాల్లో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.10,000 –18,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

బాక్సింగ్ విజేతలకు అభినందనలు


విజేతలను అభినందించి ప్రశంసా పత్రాలు అందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: గోపాలపట్నంలో ఈ నెల 1 నుంచి 3 వరకు జరిగిన జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో వి.హనుమంతకుమార్, నాయుడు, కుమారస్వామి బంగారు పతకాలు సాధించారు. విజేతలు తమ కోచ్‌లతో కలిసి సోమవారం పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె విజేతలను అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముగ్గురు కూడా ప్రతిభ కనబరిచి విశాఖ నగరం నుంచి జాతీయ స్థాయిలో ఆడడానికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. యువత మరింతగా క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. పిల్లలకు క్రీడా రంగంలో తల్లిదండ్రులు సహకారం అందించి ప్రోత్సహించాలన్నారు.

విమ్స్‌లో ప్లాస్టిక్ సర్జరీ ఉచిత వైద్య శిబిరం రేపు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఈ నెల 6న ఉచిత ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేయనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణం మొర్రి, డయాబెటిక్ ఫుట్, పురుషులలో రొమ్ము గ్రంధి పెరుగుదల, బోదకాలు, కిలాయిడ్ చికిత్సలు, కాలిన గాయాలు, విరిగిన చేతులు, కాళ్లు, వాస్కులర్ సమస్యలకు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్లాస్టిక్ సర్జరీ, కాస్మోటిక్ సర్జరీలకు సంబంధించిన చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా రూ.6 వేలు ఖరీదైన కలర్ డాప్లర్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శరవేగంగా కల్యాణ మండపం పనులు


బాలాజీనగర్‌లో జరుగుతున్న కల్యాణ మండపం నిర్మాణ పనులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో జీవీఎంసీ కల్యాణ మండపం పనులు శరవేగంగా సాగుతున్నాయి. శిథిలావస్థలో ఉండే పాత కల్యాణ మండపాన్ని తొలగించి దాని స్థానంలో జీవీఎంసీ అధికారులు ఆధునిక కల్యాణ మండపాన్ని సుమారు 2000 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలంలో నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే. దీని కోసం అధికారులు సుమారు రూ.7 కోట్లు నిధులు కేటాయించారు. ఇక్కడ ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నారు. రెండు లిఫ్టులు, సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్, విశాలమైన హాల్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వస్తే అటు ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, బాలాజీనగర్, టీఐసీ పాయింట్, ఇటు రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీ ఫారం, పెదగదిలి, చినగదిలి ప్రాంతాలకు అందుబాటులో ఉంటుంది. వార్డులో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీతల మూర్తి తీరుపై నిరసన


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సంత వ్యాపారులు

సీతమ్మధార : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డులో కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తొలగించిన సంతను, తోపుడు బళ్ల వ్యాపారులను కొనసాగించాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కోశాధికారి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీతల మూర్తి తీరుకు నిరసనగా వ్యాపారులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా 200 కుటుంబాలు తోపుడు బళ్లపైన, నేలపైన వ్యాపారులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. అటువంటి నిరుపేద వ్యాపారులను జనసేన కార్పొరేటర్ మూర్తి కక్ష కట్టి తొలగించడం దారుణమన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కళాభారతి మార్గంలో వారం సంతను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూర్తి మొండి వైఖరి వీడకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కుమారి, చందు, శ్రీను పాల్గొన్నారు.

శివాజీ పార్కులో వాకర్స్ వార్షికోత్సవం

ఎంవీపీ కాలనీ: శివాజీ పార్కులో గొడుగు వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వాకర్స్ క్లబ్‌ల వ్యవస్థాపకుడు ఆళ్వార్‌దాస్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న యు.శుభ మాట్లాడుతూ శివాజీపాలెం గొడుగు వాకర్స్ అసోసియేషన్ సేవలను కొనియాడారు. ఏడాదిలోనే వివిధ అంశాల్లో ప్రజలను చైతన్య పరచడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఈ అసోసియేషన్ ముందుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విలువైన సేవలు ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వీఎస్ఆర్‌కే ప్రసాద్, కె.శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో పరిసరాల పరిశుభ్రత


జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ మధ్య బస్ స్టాప్ వద్ద స్టిక్కర్లు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 5న విశాఖ పర్యటనకు రానున్న దృష్ట్యా బీచ్ రోడ్డులో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జోడుగుళ్లపాలెం నుంచి సాగర్‌నగర్, రుషికొండ వరకు బీచ్ రోడ్డును జీవీఎంసీ అధికారులు సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా పరిధిలో బస్ స్టాప్‌లు, విద్యుత్ స్తంభాలకు, గోడలపైన అంటించిన పోస్టర్లు, ప్రకటన పత్రాలను సోమవారం తొలగించారు. శానిటరీ అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి


తన బంగ్లా నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగరంలో కాలుష్యం తగ్గించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సోమవారం ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో – వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు అనేక చర్యలు చేపడతున్నామన్నారు.

11న మేజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట : విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 6న కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయిన అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం, రూడకోట పంచాయతీ, బడంబీరు గ్రామానికి చెందిన కోడ పోతన్న మరణాన్ని లాకప్ డెత్‌గా పరిగణించి మేజిస్టీరియల్ విచారణకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11న విశాఖ కలెక్టరేట్‌లోని ఆర్‌డీవో కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. కోడ పోతన్న సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో అనారోగ్యానికి గురయ్యారని, ఫిబ్రవరి 6న చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా, అదే రోజు మధ్యాహ్నం మృతి చెందాడని వివరించారు. పోతన్న మరణానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు విచారణకు హాజరై లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్‌డీవో కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బిహార్‌కు చెందిన లాలం కుమార్ యాదవ్ అనే వ్యక్తి చెన్నైలోని ఓ టీ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి మరో టీ షాపులో వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడు కుమార్ యాదవ్‌తో మంతనాలు జరిపి అరకు ప్రాంతానికి వెళ్లి గంజాయి తీసుకొస్తే రూ.3 వేల ఇస్తానన్నాడు. అరకు వెళ్లేందుకు ట్రైన్ టికెట్లు తీస్తానని చెప్పి దారి ఖర్చుల కోసం రూ.1000 రూపాయలు ఇస్తానని చెప్పడంతో కుమార్ యాదవ్ ఒప్పుకున్నాడు. దీంతో చెన్నై నుంచి బయలుదేరి విశాఖ వచ్చిన కుమార్‌ను రైల్వే స్టేషన్‌లో అరకుకు చెందిన మధ్యవర్తి వచ్చి అరకు తీసుకెళ్లాడు. అక్కడ నాలుగు కిలోల గంజాయి కొని లాలం కుమార్ యాదవ్‌కు రెండు ప్యాకెట్లుగా తయారు చేసి అందజేశాడు. నాలుగు కిలోలకు సంబంధించిను నగదును ఫోన్‌పే ద్వారా చెన్నైలో ఉన్న వ్యక్తి పంపించాడు. అరకు నుంచి గంజాయి తీసుకొచ్చిన కుమార్ యాదవ్ విశాఖ రైల్వే స్టేషన్ దరి అనుమానాస్పదంగా కనిపించడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నాలుగు కిలోలు గంజాయి తరలిస్తున్నట్లు చెప్పడంతో నిందితుడిని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ ఎస్.విజయకుమార్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫిఫ్త్ టౌన్ పీఎస్ పరిధిలో..

మర్రిపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.

వివరాలిలా.. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆదివారం ఉదయం కంచరపాలెం మెట్టు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కేరళకు చెందిన అస్కర్ అలీ అనే వ్యక్తి అరకు నుంచి గంజాయిని తరలిస్తున్న క్రమంలో అతడిని పట్టుకున్నారు. 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆదివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సందర్శన

ఎంవీపీ కాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విశాఖ ప్రాంతీయ కేంద్రాన్ని వీసీ ఆచార్య నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. విశాఖ ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఉన్న 11 జిల్లాల్లోని 12 అధ్యయన కేంద్రాల పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూరవిద్యతో పాటు ఆన్‌లైన్ కోర్సుల ద్వారా ఎక్కువ మందికి ఉన్నత విద్యావకాశాలు ఇగ్నో అందిస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా ఎన్నో కొత్త కోర్సులను రెండేళ్లలో అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. నూతన జాతీయ విద్యావిధానం మార్గదర్శకాలకు అనుగుణంగా ఇగ్నో యువతను నైపుణ్యభరితంగా తీర్చిదిద్దే ఎన్నో కోర్సులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. విద్యార్థులకు అందించే సేవల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా పనిచేయాలని విశాఖ ప్రాంతీయ కార్యాలయం అధికారులకు సూచించారు. విద్యార్థుల సమస్యలు, పిర్యాదుల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. విశాఖ ప్రాంతీయ కేంద్ర పరిధిలో రానున్న రోజుల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకుడు ధర్మారావు, ఉపసంచాలకుడు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

సీఎం జగన్ సారథ్యంలోనే 'నగరాలు'కు గుర్తింపు


సంఘీభావం తెలియజేస్తున్న నగరాలు కుల పెద్దలు, పోతిన శ్రీనివాసరావు, తదితరులు

మధురవాడ: నగరాలు కులానికి ప్రత్యేక గుర్తింపునిచ్చి, ప్రోత్సహించింది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని నగరాలు కుల పెద్దలు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు రెండు సార్లు చైర్మన్ పదవి మధురవాడ ప్రాంతానికి చెందినవారికి ఇచ్చారన్నారు.

తమకిచ్చిన గౌరవానికి కృతజ్ఞతగా బుధవారం మధురవాడ శిల్పారామం జాతరలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. నగరాలను బీసీ ఏలో చేర్చాలని, తమ కుల సామాజిక భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఎకరా స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నగరాలు కుల పెద్దలు పోతిన హనుమంతురావు, జగ్గుపిల్లి అప్పలరాజు, పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, వాండ్రాసి రవి, పిళ్లా రమణ, పోతిన సుమన్ వెంకటరావు, నాగోతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం


మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

సీతంపేట: బహుజనుల రాజ్యాధికారమే బహుజన సమాజ్‌పార్టీ మేనిఫెస్టో అని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తోందని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త, మాజీ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రా జిల్లాలు బహుజన జిల్లాలని, రాష్ట్రాన్ని ఏలే రెండు కులాలకు సంబంధం లేని జిల్లాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండుకులాల మధ్య, రెండు పార్టీల మధ్య విపరీతమైన సంఘర్షణ వాతావరణం ఉందని, కొన్ని వేల కోట్లతో రాజకీయ వ్యాపారం జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీలు ఓట్లను ఎలా కోట్లుగా మార్చుకుంటున్నారో బహుజనులు గుర్తించాలన్నారు. లకే రాజారావు ఆదర్శవంతమైన నాయకుడని, ఆయనే అందరికీ స్ఫూర్తి అని అన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తున్న బీఎస్పీని అభ్యర్థులను బహుజనులంతా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, రాష్ట్ర కార్యదర్శి కదిరి రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తిరుపతిరావు, ప్రకాష్, శివప్రసాద్, బోని కృష్ణ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు


బ్రీత్ ఎన్‌లైజర్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది

సీతమ్మధార: మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. గురుద్వారా, ఆశీలమెట్ట తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ద్వారకా ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురు యువకులను గుర్తించి బ్రీత్ ఎన్‌లైజర్ టెస్టులు చేశారు. అధిక మోతాదులో మద్యం తాగిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కరరావు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాన్ని నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలని, లేనిపక్షంలో జరిమానా విధించి, చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు ఎవరూ వాహనాలు ఇవ్వరాదని సూచించారు.